సీపీఎం, సీపీఐ అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర - విశాఖ: ఈ ఎన్నికలలో విశాఖ పశ్చిమ నియోజకవర్గానికి సీపీఐ అభ్యర్థిగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు అత్తిలి విమల, గాజువాక అసెంబ్లీ నియోజక వర్గానికి సీపీఎం అభ్యర్థిగా జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు పోటీ చేస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సీపీఎం సీనియర్ నాయకులు సిహెచ్.నరసింగరావు తెలిపారు. సిపిఎం, సిపిఐ శుక్రవారం ఉమ్మడిగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సిపిఐ, సిపిఎం అభ్యర్థులను మంచి మెజార్టీతో గెలిపించి, రాష్ట్ర అసెంబ్లీకి పంపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. రాష్ట్ర శాసనసభలో కమ్యూనిస్టులు లేకపోవడంతో కార్మిక, ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని.., టిడిపి, వైసిపి రెండూ ఒకరిని ఒకరు తిట్టుకోవడానికి అసెంబ్లీ వేదికను ఉపయో గించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రజలపై విద్యుత్ ఛార్జీలు, ఆస్తిపన్ను, చెత్తపన్ను భారాలు వైసిపి ప్రభుత్వం మోపుతున్నా ప్రతిపక్ష పార్టీ తన పాత్ర ఎన్నడూ పోషించలేదన్నారు. రాష్ట్రంలో వామపక్ష పార్టీలకు ఎమ్మెల్యేలు లేకపోయినా ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ సిపిఐ, సిపిఎం ఉద్యమాలు నిర్వహిస్తున్నాయని గుర్తుచేసారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకోసం వామపక్ష పార్టీలు నికరంగా నిలబడి ఉద్యమిస్తున్నా యన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక 2020 విద్యుత్ సవరణ చట్టం, కార్మిక లేబర్ కోడ్స్, పట్టణ సంస్కరణలను.. రాష్ట్ర వైసిపి, టిడిపి పార్టీల ఎంపిలు పార్లమెంటులో ఆమోదించారన్నారు. రాష్ట్రానికి ద్రోహంచేసే బిజెపితో ప్రత్యక్షంగా టిడిపి, జనసేన, పరోక్షంగా వైసిపి పార్టీలు మద్దతు ఇవ్వడాన్ని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో ఇండియా కూటమిలో ఉన్న సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, జైభారత్ పార్టీలను కూడా బలపర్చాలని కోరారు.

ఇంటర్ విద్యార్థుల ఫెయిల్‌కు ప్రభుత్వమే కారణం

ఏఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు

విశాలాంధ్ర - విశాఖ: రాష్ట్రంలో విద్యా వ్యవస్థకు పెద్దపీట వేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని ఏఐ ఎస్ఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎక్కడా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వలేని దుస్థితి ఉందని, కనీసం పాఠాలు బోధించే ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా తగిన సంఖ్యలో లేరని విమర్శించారు. కళాశాలల్లో పూర్తి స్థాయిలో విద్యార్థులకు సరైన మౌలిక వసతులు లేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. పాఠ్య పుస్త కాలు, ఉపాధ్యాయులు, సరైన మౌలిక వస తులు లేకపోతే విద్యార్థులు ఏ విధంగా చదు వుకొని ఉత్తీర్ణత సాధిస్తారని ప్రశ్నించారు. అమ్మ ఒడి, విద్య దీవెన అని చెప్పి పబ్బం గడిపారని.. ఇప్పటివరకూ పూర్తి స్థాయిలో విద్యార్థులకు అమ్మ ఒడి, విద్యా దీవెన జమ కాలేదని అన్నారు. అలాగే ప్రభుత్వ హాస్టళ్ళకు కొన్ని నెలల నుండి మెస్ బిల్లులు విడుదల చేయలేదని, దీని వల్ల హాస్టల్ వార్డెన్లు విద్యార్థులకు సరైన టైమ్‌కి పౌష్టికాహారం అందించడంలో విఫలమవు తున్నారని అన్నారు. విద్యార్థులకు కనీసం తినడానికి తిండి, చదువుకోడానికి పాఠ్య పుస్తకాలు ఇవ్వకపోతే వారి విద్యభ్యాసం ఎలా మెరుగవుతుందని ప్రశ్నించారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో వేల సంఖ్యలలో విద్యార్థులు ఫెయిలయ్యారని వాళ్ళని అమ్మ ఒడి, విద్య దీవెన కాపాడలేకపోయాయని అన్నారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఫెయిలవ్వడానికి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు.

రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేసిన జగన్

విశాలాంధ్ర - మల్కాపురం: తాము అధికారంలోకి రాగానే సంపూర్ణ మద్యనిషేదం అమలు చేస్తామని, అక్క చెల్లెమ్మలు నన్ను ఆశీర్వదించండని నమ్మబలికి మహిళా ఓట్లతో గద్దెనెక్కిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి మద్యనిషేదం చేయకపోగా రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని మహిళా సంఘాల నేతలు ఆరోపించారు. ఇండియా కూటమి తరపున విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థి అత్తిలి విమల అభ్యర్థిత్వాన్ని బలపర్చుతూ శుక్రవారం సీపీఐ గ్రామ మండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ నాయకురాలు రజియాన బేగం, ఐద్వా నేత పద్మా, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు వనజాక్షిలు మాట్లాడారు. సంపూర్ణ మద్యనిషేదం అమలు చేసిన తరువాతే ఓట్లు అడుగుతానని చెప్పిన జగన్ నేడు ఎలా ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని వ్యంగ్యంగా విమర్శించారు. మరోవైపు బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టి రాజ్యాంగాన్ని మార్చేయాలని బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారని, బీజేపీ మళ్ళీ అధికారం చేపడితే దేశం సర్వనాశనం అవుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి పట్టని వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి అత్తిలి విమల, మహిళా సమాఖ్య నేతలు జి.జయ, దేవుడమ్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు అండగా ఉండేవారినే గెలిపిస్తాం

ఆ యూనియన్ నేత వామనమూర్తి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాష్ట్రవ్యాప్తంగా ఆటో అండ్ మోటార్ వాహన డ్రైవర్ల సమస్యలను అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టో పెట్టాలని కోరుతూ శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆటో కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆటో వర్కర్స్ యూనియన్ నేత వామనమూర్తి మాట్లాడుతూ ఆటో అండ్ మోటార్ వాహన డ్రైవర్లకు, మోటార్ వాహన మెకానిక్‌లకు, పెయింటర్లు ఇతర కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సమగ్ర సంక్షేమ చట్టం చేస్తామని పార్లమెంట్‌కి పోటీ చేస్తున్న ఎంపీలు హామీ ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం భారీగా జరిమానాలు పెంచుతూ విడుదల చేసిన జీవోలు 21,31 రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ ఉన్న పోలీస్ ఈ చలనాలను రద్దు చేస్తామని హామీ ఇస్తూ శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల పోటీ చేస్తున్న ప్రజాప్రతినిధులు ప్రచార సభల్లో ఆటో అండ్ మోటార్ కార్మికుల సమస్యలపై పోరాడే వారిని గెలిపిస్తామని అన్నారు. డ్రైవర్ల సంక్షేమాన్ని పాలకులు గుర్తించి ఈఎస్ఐ, పిఎఫ్, పెన్షన్‌తో కూడిన సమగ్ర సంక్షేమ బోర్డు చేయాలని అన్నారు. 2014 ఎన్నికల్లో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో డీజిల్ పెట్రోల్ వంట గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, సంవత్సరానికి రెండు కోట్ల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెలికి తీసి దేశంలో ప్రతి పేద కుటుంబానికి 15 లక్షల రూపాయలు తమ బ్యాంకు ఖాతాలో వేస్తామని హామీ ఇచ్చారని ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. ఈ ఎన్నికలలో రాజకీయ నాయకులు డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోని పక్షంలో 2029లో జరుగు 175 శాసనసభ స్థానాల్లోనూ, 25 పార్లమెంటు స్థానాల్లోనూ ఆటో అండ్ మోటార్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీ చేసి పాలకులకు కళ్ళు తెరిపించాలన్నారు.

విజయం ఖాయం: గంటా

విశాలాంధ్ర - భీమిలి: జనసేన బీజేపీ సమన్వయంతో విజయం సాధించడం ఖాయమని కూటమి భీమిలి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి గంట శ్రీనివాసరావు అన్నారు. భీమిలి నియోజకవర్గం కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిక్కెట్ ప్రకటించిన రోజే విజయం ఖరారు అయిందని నాకు రాబోయే భారీ మెజార్టీ గురించి చర్చ జరుగుతుందని అన్నారు. పాజిటివ్ ట్రెండ్‌కు కారణమైన కార్యకర్తలకు రుణపడి ఉంటానని నియోజకవర్గంలో ఆ ప్రచారాలకు భారీ స్పందన రావడం వెనుక కార్యకర్తల కష్టం ఉందని నా మెజారిటీపై ఉన్న భారీ అంచనా మూడు పార్టీలు సమన్వయంతో అందుకుంటాయన్నారు. నామినేషన్ దాఖలతో మూడొంతుల ఎలక్షన్ అయిపోయినట్టేనని భారీ ర్యాలీతో వెళ్లి నామినేషన్ సమర్పిస్తానని ఈ కార్యక్రమం ఘనవిజయానికి భీమిలి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల కార్యకర్తలు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్చార్జ్ కోరాడ రాజబాబు, జనసేన నాయకులు శేఖర్ శ్రీనివాస్, చంద్రరావు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మూడు పార్టీల ఇన్చార్జిలు పాల్గొన్నారు.

మాజీ ఆర్మీ సోదరులు ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం జంక్షన్‌లో విగ్నేశ్వర ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ సభ్యులు ప్రెసిడెంట్ సాడి రమేష్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బూస రమణ, సెక్రటరీ చెన్నా నర్సింగ్‌రావు, జాయింట్ సెక్రటరీ పల్లంటి జనార్ధన్, ట్రెజరర్ తాటిచెట్టి మోహన్ సమక్షంలో భీమిలి శ్రీ చైతన్య ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్, గుడివాడ జై జవాన్ ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్, చిప్పాడ శ్రీ సుత్తమ్మ తల్లి ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్, మాజీ సైనికుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆనందపురం అసోసియేషన్ ప్రెసిడెంట్ సాడి రమేష్ రెడ్డి, భీమిలి శ్రీ చైతన్య అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.గురయ్య రెడ్డి, చిప్పాడ అసోసియేషన్ ప్రెసిడెంట్ సూరిబాబు, గుడివాడ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవిశంకర్‌లు సూచనలు సలహాలు ఇచ్చారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా సైనికుల కొరకు అసోసియేషన్ ఆఫీస్ స్థలం, సైనికుల సమస్యలు పరిష్కరించే పార్టీకి తప్పనిసరిగా సహకరిస్తామన్నారు.

కార్ షెడ్ వద్ద వైసీపీ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - పీఎం పాలెం: పీఎం పాలెం కార్ షెడ్ జంక్షన్ వద్ద వైసీపీ నూతన ఎన్నికల కార్యాలయాన్ని శుక్రవారం ఉదయం రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. మాజీ మంత్రి, భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించాలని కోరారు. వాంబే కోలనీ - సేవా నగర్ నుంచి 300 మంది భీమిలిలో అవంతి పాలనకు జై కొడుతూ వైసిపి పార్టీలో చేరారు. ముత్తంశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తోడ్పాటుతో భీమిలి నియోజకవర్గంలో ఈ 5 ఏళ్ళలో సంక్షేమం క్రింద 2,500 కోట్లు, అభివృద్ధి క్రింద 500 కోట్లు ఖర్చు చేసి పార్కులు, సిసి రోడ్లు డ్రైనేజీ లు ఇంటింటి కొళాయిలు తదితరాలు చేయడం జరిగిందన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా వైసిపి అధ్యక్షులు కోలా గురువులు, మాజీ మంత్రి భీమిలి నియోజకవర్గం పరిశీలకులు పసుపులేటి బాలరాజు, ఉమ్మడి విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ముత్తంశెట్టి శివ నందీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - సాగర్‌నగర్: స్నేహితులతో సరదాగా గడిపేందుకు రుషికొండ బీచ్‌కు వచ్చిన యువకుడు గల్లంతయ్యాడు. కంచరపాలెం ఊర్వశి జంక్షన్‌కు చెందిన తేజ (20) గురువారం సాయంత్రం తన(ఇంటర్) స్నేహితులు జి.సృజన్, జి.హర్ష, వంశీ, సాయి వెంకట్, ప్రణీత్‌లతో కలసి రుషికొండ బీచ్‌కు వచ్చాడు. బీచ్‌లో సుమారు మూడు గంటల పాటు సరదాగా గడిపి ఫొటోలు తీసుకున్నారు. రాత్రి 7 గంటల సమయంలో ఈ ఆరుగురు స్నేహితులు రుషికొండ బీచ్‌కు కాస్త దూరం వెళ్లి స్నానాలకు దిగారు. ఈ క్రమంలో పెద్ద కెరటం ఒక్కసారిగా రావడంతో తేజ సముద్రంలోకి కొట్టుకు పోయాడు. స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించి, పెద్దగా కేకలు వేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఇది గమనించిన లైఫ్‌గార్డ్స్ ఘటనా స్థలానికి చేరుకుని గాలించినప్పటికీ తేజ ఆచూకీ లభ్యం కాలేదు. ఎట్టకేలకు శుక్రవారం మృతదేహం లభ్యమైంది.

ఇంటింట ప్రచారంలో ఆడారి ఆనంద్

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 92వ వార్డు వెంకటాపురంలో జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో వైసిపి విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వెంకటాపురంలో ఇంటింట ప్రచారం అనంతరం రోడ్డు షో చేశారు. ఈ మేరకు ప్రజలతో కొంతసేపు ముచ్చటించారు. రానున్న ఎన్నికల్లో మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. అలాగే విశాఖ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బొత్స ఝాన్సీలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం పరిశీలకులు ఎస్సే రెహమాన్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆడారిని గెలిపిస్తే..అభివృద్ధి మీ సొంతం

విశాలాంధ్ర - మర్రిపాలెం: పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్ కుమార్‌ని గెలిపిస్తే, నియోజకవర్గ అభివృద్ధి మీ సొంతం అని ఎలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్ రమా కుమారి అన్నారు. 62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు, వార్డు అధ్యక్షులు భీశెట్టి గణేష్ ఆధ్వర్యంలో ప్రకాష్ నగర్‌లో ప్రచారం నిర్వహించారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ విజయానికి ఓటర్లందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వార్డులో కలియ తిరిగిన ఆమెకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. నియోజకవర్గం అభివృద్ధిలో ఆడారి ముందుంటారని అన్నారు.

ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర - పద్మనాభం: ఇంటర్మీడియట్ పరీక్షల్లో కేజీబీవీ పద్మనాభం విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. రెండవ సంవత్సరం సి.హెచ్.రమ్య 922/1000 మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరం బోణి ధనలక్ష్మి 412/470 మార్కులు సాధించారని ప్రిన్సిపల్ తెలియజేశారు. విద్యార్థులు మంచి క్రమశిక్షణతో పట్టుదలతో కష్టపడి చదివి మంచి మార్కులు సాధించడం అభినందనీయమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థికి అభినందనలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: లారీ కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన రామాటకీస్ మీదగా సిరిపురం టీనెట్ ఎదురుగా శ్రీ లక్ష్మి గణపతి గుడి వద్ద చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మృతుడు విజయనగరం జిల్లా వేపాడ మండలం కృష్ణరాజాపురం చెందిన రాజకుమార్ (30)గా పోలీసులు గుర్తించారు. కావేరి ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఢీకొట్టడంతో బస్ కింద పడ్డ రాజకుమార్ తల బస్ టైర్ల కింద పడి నుజ్జు నుజ్జు అయింది. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ ఏడీసీపీ ఆర్.శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడులు కావేరి ట్రావెల్స్ బస్సు డ్రైవర్ క్లీనర్‌లను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

మామిడిలోవలో ముమ్మరంగా వైసీపీ ప్రచారం

విశాలాంధ్ర - ఆనందపురం: రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగున్నర సంవత్సరాల కాలంలో పేద ప్రజలందరికీ అందించిన సంక్షేమం, అభివృద్ధి జగనన్న కాలనీలు మొదలగు పథకాల గురించి మండల పార్టీ ప్రెసిడెంట్

బంక సత్యం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. శుక్రవారం ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ పరిధిలో సుమారు 200 మందితో ఎన్నికల ప్రచారం నిర్వహించి ప్రభుత్వ సంక్షేమాన్ని వివరించారు. పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ, శాసనసభ అభ్యర్థి అవంతి శ్రీనివాసరావు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, మామిడిలో పంచాయతీ అధ్యక్షులు బలిరెడ్డి మహేష్, సర్పంచులు గన్‌రెడ్డి శ్రీనివాస్, లంక రాంబాబు, ఎంపీటీసీ డోలా గౌతమి ఆనంద్ పాల్గొన్నారు.

75వ వార్డులో పల్లా పాదయాత్ర

విశాలాంధ్ర - పెదగంట్యాడ: కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు 75వ వార్డులోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టారు. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి ఆధ్వర్యంలో ఆమె భర్త విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, కుమారుడు పులి సురేష్ రెడ్డి (బాబీ) పెదగంట్యాడ ప్రాంత నాయకులను సమన్వయం చేసుకుంటూ పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత కోన తాతారావు, బీజేపీ గాజువాక ఇన్చార్జి కరణంరెడ్డి నరసింగరావు, 76 వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద రెడ్డి, 75వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, దోమ్మేటి పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు రెడ్డిలు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు

విశాలాంధ్ర - పెందుర్తి: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, విజయ సాయి రెడ్డి, వైవి సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుంటున్నారని విశాఖపట్నం జిల్లా పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్డీఏ కూటమి నాయకులు ఆరోపించారు. జీవీఎంసీ 97వ వార్డు జనసేన నాయకుడు అయితి సింహాచలం నిర్వహించిన జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ నాయుడు సోదరుడు శ్రీనివాస్ నాయుడు, బీజేపీ పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రాము నాయుడు, జనసేన నాయకులు అయితి సింహాచలం, సేనాపతి సోమశేఖర్ మాట్లాడుతూ ముఖ్య నగరాల్లో వందల కోట్ల రూపాయలతో భారీ భవంతులు నిర్మించుకుని ఉన్న జగన్మోహన్ రెడ్డి, వచ్చే ఎన్నికలు పేదలకు పెత్తందారులకు మధ్య పోటీ అంటూ వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. తాను చేస్తున్న అక్రమాలను ప్రజలు గుర్తించడం లేదన్న భ్రమలో ఉన్న జగన్మోహన్ రెడ్డికి సరైన రీతిలో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గొర్లె అప్పారావు, ఆర్ఎస్ నాయుడు పెద్ద సంఖ్యలో జనసేన టిడిపి బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం క్రికెట్ టోర్నమెంట్లో విజయం సాధించిన యువకులకు రమేష్ బాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

కప్ప స్తంభం వార్షిక ఆదాయం రూ.92.42 లక్షలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి కప్ప స్తంభం వార్షిక ఆదాయం రూ.92,42,715లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సింహాద్రి నాథుని కప్ప స్తంభం ఆలింగనంకు ఓ ప్రత్యేకత ఉంది. వరాహ ముఖం, మానవ శరీరం, సింహపు తోక(వాలము)తో కూడిన స్వామివారి శరీరం ఇంకెక్కడా కనిపించదు. బయట నుంచి చూస్తే ఈ ఆలయం ఓ కోటలా ఉంటుంది. సింహాచల దేవాలయం మిగిలిన అన్ని దేవాలయాలు ఉన్నట్టు తూర్పు ముఖముగా కాకుండా, పడమర వైపు ముఖద్వారం ఉంటుంది. సాధారణంగా తూర్పున ముఖద్వారం ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తే, పడమర ముఖద్వార విజయాన్ని ఒసుగుతుందని నమ్మకం. దేవాల యంలో ఉన్న ఈ కప్పస్తంభానికి మూల విరాట్‌కి మించిన ప్రఖ్యాతి వుంది. దేవాలయపు గర్భగుడికి ఎదురుగా ఉన్న ప్రాకారంలో ఉంది. సంతాన గోపాలస్వామి యంత్రాన్ని ప్రతిష్టించి పైన కప్ప(వు) స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ స్తంభాన్ని కౌగిలించుకున్న (ఆలింగనం) దంపతులకు సంతాన సౌభాగ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం. సంతానం కోసం మాత్రమే కాదు మానవ సహజమైన కోర్కెలు కోరుకుని ఈ స్తంభాన్ని ఆలింగనం చేసుకుని మొక్కు లు చెల్లిస్తే కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వాస్తవానికి ఇక్కడ కప్పము (మొక్కు బడులు) చెల్లించినందున కప్ప స్తంభం అని పిలిచేవారు. కాలక్రమేణా అది కప్ప స్తంభంగా పిలువబడుతుంది.

అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో 14న బహిరంగ సభ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: డా.బి.ఆర్. అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ నేతృత్వంలో పలు కార్యక్రమాలు, బహిరంగ సభను ఈనెల 14వ తేదీన నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బి.కళ్యాణ్ రావు, జేవీ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం జరిగిన కమిటీ కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. 14వ తేదీ ఉదయం 8:30 గంటలకు ఎల్ఐసి కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల అలంకరణ చేసి నివాళులు, అంబేద్కర్ బుద్ధ విహార్ ఫౌండేషన్ డే ఉత్సవాలు, సాయంత్రం నాలుగు గంటలకు ఎల్ఐసి కూడలి నుండి అంబేద్కర్ భవనం వరకు భారీ ర్యాలీ జరుగుతుందన్నారు. ఐదు గంటలకు అంబేద్కర్ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ స్టీల్ ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డా.ఎస్.కరుణ రాజు హాజరవుతారని, విశిష్ట అతిథిగా భారత్ బచావో ఆల్ ఇండియా వైస్ చైర్మన్ డాక్టర్ ఎమ్ఎఫ్ గోపి నాథ్, జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ బి సురేష్ కుమార్, కెజిహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ జి.అర్జున, తెచ్చి డాక్టర్ జి అర్జున, డిఎంఇ పాడేరు డాక్టర్ పి.విశ్వమిత్ర, ఏసిపి త్రినాథ్, డాక్టర్ టీ.జయరాజు పాల్గొంటారని తెలిపారు. కమిటీ సమావేశంలో కోశాధికారి జి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఇంటి గురుమూర్తి, కడితి సాధు, అలమండ ప్రసాదు కాంతారావు, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

తూర్పులో విస్తృతంగా టీడీపీ ప్రచారం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: 17వ వార్డు ఆదర్శ్ నగర్ ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చోడే వెంకట పట్టాభి రామ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణ బాబు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్ళి కరపత్రాలు పంచి ఓటు వేయమని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నెక్కంటి సత్తిబాబు, కాళ్ళ శంకర్, పోతన్న రెడ్డి, వర, లక్ష్మి, జీవిత, గోపమ్మ, మహేష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా: హాసిని వర్మ

విశాలాంధ్ర - భీమిలి: ఎమ్మెల్యే, ఎంపీలుగా స్థానిక నాయకులకు అవకాశం ఇవ్వడం ద్వారా సమస్యలను సత్వరమే పరిష్కరించుకునే వీలు కలుగుతుందని ఏ.పి.సి.సి జనరల్ సెక్రటరీ గాదం మహేష్ అన్నారు. భీమిలి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్డాల వర్మరాజు తాళ్ళవలసలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే స్థానిక నాయకులను గెలిపించుకోవాలని కోరారు. భీమిలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి హాసిని వర్మ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా భీమిలి నియోజక వర్గంలో బయట నుంచి వచ్చిన నాయకులకు పట్టం కట్టి గెలిపించినా ఎటువంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తనపై నమ్మకం ఉంచి భీమిలి నియోజక వర్గం నుంచి పోటీ చేయడానికి అవకాశం కల్పించిందని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి పనిచేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేసు కుంటూ పరిపాలన సాగించిందని, వైఎస్ రాజశేఖర రెడ్డి అభిమానులందరూ తిరిగి కాంగ్రెస్ పార్టీకి త్వరలోనే వస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలు వార్డుల అధ్యక్షులు పుక్కళ్ళ రాజు, ఎం.గౌతమ్, ఆర్.మధుసూదన్, రజనీకాంత్, నాయకులు బార్ల కేశవ మూర్తి, గంధవరపు రమణ తదితరులు పాల్గొన్నారు.

గీతం మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉద్యోగాలు



విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ప్రాంగణ నియామకాలలో మేనేజ్‌మెంట్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు సత్తా చాటారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ కోర్సులు అభ్యసిస్తున్న మొత్తం 103 మంది గీతం విద్యార్థులకు అధిక వేతనంతో ప్రముఖ సంస్థలు అవకాశాలు కల్పించాయని గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ ఎస్.వంశీకిరణ్ సోమ యాజుల తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎంబిఏ తదితర కోర్సుల ఆఖరి సంవత్సరం విద్యార్థులకు రూ. 14.25 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు లభించాయని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం, స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా.ఫణి పప్పు తదితరులు అభినందించారు.

పెందుర్తి బీఎస్పీ అభ్యర్థిగా బంగారి రమణ

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు బంగారి రమణ తెలియజేశారు. శుక్రవారం పెందుర్తి ఎంపీడీవో కార్యాలయం వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద బిఎస్పి సమన్వయకర్త సబ్బవరపు అప్పలరాజు, ఉపాధ్యక్షురాలు ఈర్లగడ్డ శారద, కార్యదర్శి కణితి దేముడు బాబు, మండల పార్టీ అధ్యక్షులు కాకర ప్రేమ్ కుమార్, పార్టీ నాయకులు బంగారి అప్పలసూరి, దుర్గాప్రసాద్, నిమ్మకాయలు దేముడు తదితరులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారు రమణ మాట్లాడుతూ తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భక్తాపరంజ్యోతి, పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ మాజీ డిజిపి పూర్ణచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, కరణం తిరుపతిరావు, విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షులు బోను కృష్ణ, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు గురి చిన్నారావులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ అధిష్టానం మేరకు నియోజకవర్గం పరిధిలోని పెందుర్తి పరవాడ సబ్బవరం మండలాల్లో పార్టీ నాయకులతో కలిసి విస్తృతంగా పర్య దించి ఓటర్లను ప్రసన్నం చేసుకొని వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. గత 15 ఏళ్లుగా పెందుర్తి నియోజకవర్గం పార్టీ అధ్యక్షుడుగా పనిచేస్తూ ప్రజలతో కలిసిమెలిసి ఉంటున్నానని ఆయన స్పష్టం చేశారు.

తూర్పులో టీడీపీ, జనసేన నుండి
వైసీపీ పార్టీలోకి చేరికలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: జగనన్న అభివృద్ధి సంక్షేమాన్ని చూసే వైసీపీ పార్టీలోకి స్వచ్ఛందంగా వస్తున్నారని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరికలు ఉంటున్నాయని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ గ అన్నారు. ఈ మేరకు విశాఖ తూర్పు నియోజకవర్గం స్థానిక జీవీఎంసీ19 వార్డ్ పెదజాలరిపేట ప్రాంతానికి చెందిన యువ నాయకులు, మహిళలు, 250 మందికి పైగా శుక్రవారం లాసన్సబే కాలనీ దరి ఎంవివి సత్యనారాయణ గారి క్యాంపు కార్యాలయంలో వైసీపీ మత్స్యకార నాయకులు గంపల వెంకట రామచంద్ర రావు సమక్షములో టీడీపీ జనసేన పార్టీ నుండి వైసిపి పార్టీలో చేరారు. ఎంవీవీతో పాటూ జీవీ పార్టీ కండువా వేసిపార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంవీవీ మాట్లాడుతూ మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతిఒక్కరినీ కంటికి రెప్పలా చూసుకుంటామని,లి ఏ సమస్య ఉన్నా నేరుగా తనను కలవ వచ్చని సూచించారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమములో వైస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పి.నారా యణ అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలంటూ
గోవింద్ పట్నాయక్ దీక్ష

విశాలాంధ్ర - పెందుర్తి: జగన్మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద పట్నాయక్ భవాని దీక్ష చేపట్టారు. శుక్రవారం ఉదయం నగరంలోని 33వ వార్డులో వైసిపి పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి ఆయన చేత దీక్ష ప్రారంభింప చేశారు. దక్షిణ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి వాసువల్లి గణేష్ కుమార్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఎన్నికల పరిశీలకులు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే విజయ్ కుమార్, వైసిపి నాయకులు ద్రోణంరాజు కిరణ్ తదితర నేతల సమక్షంలో దీక్ష చేపట్టిన గోవింద పట్నాయక్ విశాఖ రాజధాని కల నెరవేరే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి విశాఖ నుండి పాలన ప్రారంభిస్తారని ఆయన స్పష్టం చేశారు.

కూటమి అధికారంలోకి వస్తేనే అభివృద్ధి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు తెలియజేసి ఒక మంచి ప్రభుత్వానికి పట్టం కట్టాలని దక్షిణ నియోజకవర్గం అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు గ్లాసు గుర్తుపై ఎంపీ అభ్యర్థి భరత్ కి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా 31 వార్డులో పలు ప్రాంతాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బొడ్డు నాయుడు తోట, ఎల్లమ్మ తోట ,వెంకటేశ్వర థియేటర్ పరిసరాలు, సూర్యా భాగ్ ,కృష్ణ గార్డెన్ తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు . రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన గణేష్ కుమార్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా , స్వప్రయోజనం కోసం వెంపర్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ అధికారంలో వస్తే పెన్షన్ 4000 వేలు, వికలాంగుల పెన్షన్ 6000 వస్తుందని ,వాలంటీర్లకు పదివేల 10000 వస్తుందనీ ఈ సందర్భంగా తెలిపారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలలో యువతీ యువకులకు పెద్ద పేట వేస్తారని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో వార్డు జనసేన టిడిపి ,బిజెపి, శ్రేణులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్ విధానంపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: హోం ఓటింగ్ విధానంపై ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే వారంతా అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో విధులు నిర్వర్తించనున్న సెక్టోరల్, రూట్ ఆఫీసర్లకు, బీఎల్వోలకు స్థానిక వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో హోం ఓటింగ్ విధానంపై నిర్వహించిన శిక్షణా శిబిరాన్ని జేసీ శుక్రవారం సందర్శించారు. శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. హెూం ఓటింగ్ పై తొలి నుంచి చివరి వరకు జరిగే అన్ని ప్రక్రియలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయటం, హెూం ఓటింగ్ విధానం, ఇతర ప్రక్రియలపై అనుసరించాల్సిన విధానాలపై ఆయన మార్గనిర్దేశం చేశారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ క్రమంలో శిక్షణకు హాజరైన అధికారులు, సిబ్బంది అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో సేవలందించే నోడల్ అధికారులు, ఇతర అధికారులు, సెక్టోరల్, రూట్ అధికారులు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో
జిల్లా కలెక్టర్ సమావేశం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున శుక్రవారం స్థానిక రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఎన్నికల కోడ్ అమలు, కొత్త ఓటర్ల నమోదు, ప్రచార ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కలెక్టర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరూ కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ క్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల ప్రశ్నలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. కోడ్ అమల్లో అందరూ సహకరించాలని, ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయవచ్చని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం మారడం కన్నా
చేసిన అభివృద్ధి ముఖ్యం

సుబ్బారెడ్డి వ్యాఖ్యలపై ట్విట్టర్ వేదిక గంటా ఫైర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నేను నియోజకవర్గం మారడం గురించి, అభివృద్ధి గురించి వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందని, వాళ్ల పార్టీలో ఎంత మంది ఎమ్మెల్యేలను స్థానాలు మార్చి పోటీ చేయిస్తున్నారో ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు. రాజకీయాల్లో పార్టీ అధిష్టానం చెప్పినట్లు నడుచుకోవాలన్న కనీస పరిజ్ఞానం కూడా ఆయనకు లేదా అన్నారు. వైసీపీ నేతలు ఇలాంటి చవకబారు విమర్శలు చేస్తూ పోతే వారికి డిపాజిట్లు కూడా రాకుండా ఘోరంగా ఓడిపోవడం ఖాయం అని (ట్విట్టర్) వేదికగా మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఫైర్ అయ్యారు. ఇక్కడ ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేస్తున్నారనేది సమస్య కాదని, ప్రజలకు ఎంత సేవ చేస్తున్నామన్నది ముక్యం అన్నారు. మనల్ని గెలిపించిన ప్రాంతాన్ని ఎంతమేర అభివృద్ధి చేశామన్నదే ముఖ్యం అని, 2014లో నేను భీమిలి నుంచి పోటీ చేశానని, అది పూర్తిగా పార్టీ అధిష్టానం నిర్ణయంతో జరిగిందన్నారు. 2019లోనూ మా అధినేత నారా చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ నన్ను విశాఖ నార్త్ లో పోటీ చేయాలని ఆదేశించిందని, దానికి అనుగుణంగా అక్కడి నుంచి పోటీ చేసి ప్రజల ఆశీర్వాదంతో గెలిచానన్నారు. ఈ ఎన్నికల్లో పొత్తులో భాగంగా విశాఖ నార్త్ ను మా పార్టీ అదిష్టానం బీజేపీకి కేటాయించి నన్ను భీమిలి నుంచి పోటీ చేయమని ఆదేశించిందన్నారు. రాజకీయ పరిస్థితుల కారణంగా ఎన్ని జరిగినా నేను భీమిలిని ఎంత అభివృద్ధి చేశాను అనేది ప్రజలందరికీ తెలుసునని, ఇక్కడ ఎన్నికల ప్రచారం మొదలుపెట్టినప్పటి నుంచి నియోజకవర్గంలో నాకు అద్భుతమైన ప్రజాస్పందన వస్తోందన్నారు. భీమిలిలో తెలుగుదేశం పార్టీకి వస్తున్న ఆదరణను చూడలేక వైవీ సుబ్బారెడ్డి అవాకులు, చెవాకులు మాట్లాడితే ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పి బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఉత్తరాంధ్ర ఇన్ ఛార్జ్ గా ఉన్న విజయసాయి రెడ్డి ని ఎందుకు తొలగించారని, మిమ్మల్ని ఇక్కడికి ఎందుకు పంపారని, వైజాగ్ పై పెత్తనం కోసం సాయిరెడ్డి మీరు ఎందుకు కొట్టుకుంటున్నారనేది వైజాగ్ ప్రజలకు చెప్పాలన్నారు. ఇక్కడ ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను డమ్మీలు చేసి ప్రశాంతంగా ఉండే విశాఖలో విద్వేషాలు రెచ్చగొడుతున్నది మీరుకాదా అన్నారు. విశాఖలో పర్యాటకాన్ని అభివృద్ధి చెస్తున్నామని చెప్పి కొట్టుకుపోయే ఫ్లోటింగ్ బ్రిడ్జి కట్టారని, హరితా రెస్టారెంట్ ను గుడిసెలోకి మార్చారని, ఇలాంటివన్నీ చెప్పుకుంటూ పోతే ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పారిపోయే పరిస్థితి వైసీపీదన్నారు. వైసీపీ నేతలు ఇలాంటి చవకబారు విమర్శలు చేస్తూ పోతే వారికి డిపాజిట్లు కూడా రాకుండా ఘోరంగా ఓడిపోవడం ఖాయం అన్నారు.

బొత్స ఝాన్సీ లక్ష్మి, వాసుపల్లి రోడ్ షోకు
విశేష ఆదరణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: వైసిపి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా నిర్వహించిన రోడ్ షో కి విశేష ఆదరణ లభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి అడిగి మరీ వైస్సార్సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా పాలన చేసిందని అన్నారు. నీతివంతమయిన పాలనను అయిదేళ్ల అందించిన సీఎం జగన్మోహన్ రెడ్డి మళ్ళీ సీఎం ఐతేనే అభివృద్ధి కొనసాగుతుందన్నారు. విశాఖ పై ప్రత్యేక దృష్టి సారించి పరిపాలన రాజధానిగా జగనన్న నిర్ణయించారన్నారు. డాబాగార్డెన్స్ కమలా నెహ్రూ మున్సిపల్ స్కూల్‌లోనే తాను చదువుకున్నానని మళ్ళీ ఇక్కడ ఎన్నికల ప్రచారం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఎంపీ గా ఎన్నుకుంటే పుట్టినిల్లయిన విశాఖ ఋణం తీర్చుకుంటానని భావోద్వేగంలో ప్రకటించారు. మీకోసం అయిదేళ్ల కష్టపడి పనిచేసాను. వీధి, వీధినా ప్రజలు అడిగిన ప్రతీ పనీ చేశాను మళ్ళీ ఎమ్మెల్యే గా ఎన్నికైతే అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తానని విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు.ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ పేదల పక్షపాతి ఐన జగనన్న ను గెలిపించు కుంటామని అన్నారు.స్థానికురాలయిన ఝాన్సీ లక్ష్మిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పేదల ద్రోహి ఐన చంద్రబాబు పవన్ కళ్యాణ్‌లను చిత్తు చిత్తు గా ఓడించాలని పిలుపునిచ్చారు. ఉత్తర నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్ కుమార్ మాట్లాడుతూ ఉన్నత విద్యావంతు రాలయిన విశాఖ సమస్యలపై పూర్తి అవగాహన వున్న బొత్స ఝాన్సీ లక్ష్మిని ఎంపీ గా ఎన్నుకోవాలని పిలుపు నిచ్చారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేస్తేనే విశాఖ అభివృద్ధి జరుగుతుందన్నారు.కార్యక్రమం లో ద్రోణంరాజు శ్రీవాత్సవ మాట్లాడుతూ, వడ్డాది మధుసూదనరావు, ఎల్లపు రఘురామ్, వైసీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కృపా జ్యోతి, బాబు ఆనంద్, రామానంద్ సనపల రవీంద్ర, బొడ్డు అప్పలకొండమ్మ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

జుత్తాడలో ఎన్డీఏ కూటమి ముమ్మర ప్రచారం

విశాలాంధ్ర - పెందుర్తి: మండలంలోని జుత్తాడ, దువ్వపాలెం గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఎన్డీఏ కూటమి సభ్యులు ముమ్మర ఎన్నికల ప్రచారం సాగించారు. కూటమి పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ నాయుడు సోదరుడు శ్రీనివాస నాయుడు టిడిపి జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీల శ్రీనివాసరావు, బిజెపి పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు, మాజీ జెడ్పీటీసి రెడ్డి నారాయణరావు సహా మూడు పార్టీల నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామాలలే ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అన్ని విధాల నష్టపోయిందని, దాన్ని పునర్నిర్మించే శక్తి చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ, పవన్ కళ్యాణ్ కు మాత్రమే ఉందని పేర్కొన్నారు. పెందుర్తి నియోజకవర్గంలో వైసీపీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే అడ్డగోలుగా దోచుకున్నారని విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమికి ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ ఫలితాల్లో జిల్లాకు నాలుగో స్థానం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశాఖ జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచింది. తొలి మూడు స్థానాల్లో కృష్ణ గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలు నిలవగా ఫలితాల్లో విశాఖకు నాలుగో స్థానం దక్కింది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు 38818 మంది పరీక్షకు హాజరు కాగా వారిలో 30050 ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ఫస్టియర్లో 77% ఉత్తీర్ణత లభించింది. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి విశాఖ జిల్లా వ్యాప్తంగా 34672 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 29258 మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లాకు సంబంధించి ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 84 శాతం ఉత్తీర్ణత సాధించింది.

గంటా సమక్షంలో పలువురు చేరిక

విశాలాంధ్ర - సాగర్‌నగర్: భీమిలి కూటమి అభ్యర్థి గంట శ్రీనివాసరావు సమక్షంలో 8వ వార్డు ఋషికోండ తెలుగుదేశం వార్డు ప్రెసిడెంట్ శెట్టిపల్లి గోపి, చిన్న గోపి, సారీపల్లి శ్రీను, అక్కరబోయిన రాంబాబు, వాసుపల్లి ధనరాజు, బాబురావు, గద్దిపల్లి నెంబర్ అప్పన్న, గద్దిపల్లి కృష్ణ, ఎరుపల్లి అనిల్ రాజు మరియు ఉమ్మిడి చిన్నారావు వారి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు వై లక్ష్మణరావు (బీసీ సెల్ ప్రెసిడెంట్) తో రాము, రవి, దొరబాబు, శ్రీను, పెద్ద రాము, అప్పలరాజు, సతీష్ వర్మ, కుమార్, వాసు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు.

అంతర్జాతీయ బర్గర్ ఫెస్ట్‌ను ప్రారంభించిన కేఎఫ్‌సీ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: కేఎఫ్‌సీ జింగర్ బర్గర్ ఒక లెజెండరీగా నిలుస్తుందని ఐదు రకాల జింగర్ బర్గర్‌లు అందుబాటులోకి తీసుకువచ్చి ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. ఒక జ్యూసీ క్రిస్పీ కేఎఫ్‌సీ జింగర్ ఇప్పుడు లభిస్తోందన్నారు. కే ఎఫ్ సీ ఇంటర్నేషనల్ బర్గర్ ఫెస్ట్ ఒకటి కాదు రెండు కాదు ఐదు విభిన్నమైన జింగర్ బర్గర్‌లను రూ.179/- ధరలో అందిస్తోందన్నారు. అంతర్జాతీయ బర్గర్ ఫెస్ట్ గ్లోబల్ రుచులను ఆస్వాదించేందుకు కేఎఫ్‌సీ మీ పాస్‌పోర్ట్‌గా ఉండడంతో 'టేక్ ఏ బైట్, టేక్ ఏ ఫ్లైట్'కు సిద్ధంగా ఉండండి. స్పైసీ నుంచి క్లాసిక్, దాని నుంచి తందూరీ వరకు వివిధ రుచులలో- కేఎఫ్‌సీ వివిధ రకాలైన జింగర్ బర్గర్‌లు మీ కోరికలను తీర్చేందుకు గ్లోబల్ ఫ్లేవర్‌లను కలిగి ఉంటాయి.

జగన్‌ను సీఎం చేయడం కోసం కృషి చేస్తా

విశాలాంధ్ర - భీమిలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని జరగబోవు ఎన్నికలలో గెలిపించుటకు తన వంతు కృషి చేస్తానని భీమిలి ఎంపీపీ దంతులూరి వాసు రాజు శుక్రవారం పత్రికా ప్రకటనలో తెలియజేశారు. గత మూడు రోజుల క్రితం కొన్ని పరిస్థితుల వలన పార్టీకి రాజీనామా చేస్తున్నారని విలేకరుల సమావేశం నిర్వహించానని అయితే పార్టీ పెద్దలు వైవీ సుబ్బారెడ్డి, బొత్సా సత్యనారాయణ తనతో పార్టీకి ఎన్నో సేవలు చేసి ఇటువంటి సమయంలో పార్టీకి అండగా ఉండి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. పార్టీ పెద్దలు తమంతట తాము కోరినప్పుడు నా వంతు పార్టీకి పనిచేసి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవడంలో నా వంతు కృషి చేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు.

అందుబాటులోకి
అమేజాన్ ఫ్రెష్ మ్యాంగో స్టోర్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: అమేజాన్ ఫ్రెష్ ఉత్తమమైన నాణ్యత గల పండు అందేలా నిర్ధారించడానికి మ్యాంగో స్టోర్ ను ప్రారంభించింది. పోషకాలు నిండిన సఫేదా నుండి రుచికరమైన బాదామి వరకు, తేనె వంటి సింధూర, గుజ్జుతో నిండిన తోతాపురి వరకు, కస్టమర్స్ 20 కి పైగా రకాల మామిడి పండ్లను అమేజాన్ ఫ్రెష్ పై ఆనందించగలరు.

పండు నాణ్యత, ఆరోగ్యం మరియు భద్రతను నిర్ధారించడానికి, అవి కస్టమర్స్ వద్దకు చేరడానికి ముందు కఠినమైన 4 స్టెప్స్ నాణ్యతా తనిఖీ ప్రక్రియకు లోనై అన్ని మామిడి పండ్లు కార్బైడ్ రహితంగా, సురక్షితంగా పండాయి. ఇంకా, కస్టమర్స్ ఏప్రిల్ 1 నుండి 4 వరకు ఇతర ప్రముఖ క్రెడిట్/డెబిట్ కార్డ్స్ నుండి ఐసీఐసీఐ డెబిట్ మరియు క్రెడిట్ కార్డ్స్ మరియు ఈఎంఐ లావాదేవీలు, ఉత్తేజభరితమైన డీల్స్‌లి పై 10 శాతం తక్షణ తగ్గింపుతో మ్యాంగో స్టోర్ లో గొప్ప డీల్స్ మరియు ఆఫర్స్ ను ఆనందించవచ్చునని అమేజాన్ ఫ్రెష్ డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీ రామ్, అన్నారు.